క్లుప్తంగా

నేడు ఇందుపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

ఉంగుటూరు: ఇందుపల్లిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీఎస్వీ శేషగిరి రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తారని చెప్పారు. అదే విధంగా ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

పెనమలూరు: బంధువుల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీయటంతో పోలీసులు సోమవారం ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనమలూరులోని పల్లిపేటకు చెందిన ఆరేపల్లి దేవేంద్ర, పలగాని రోష్ని బంధువులు. వీరికి కుటుంబ తగాదా తలెత్తడంతో ఇరు వర్గాలు ఘర్షణకు దిగాయి. దీంతో ఒకరిపై ఒకరు కౌంటర్ కేసులు దాఖలు చేసుకున్నారు. దేవేంద్ర ఫిర్యాదు చేస్తూ ఆరేపల్లి సూరిబాబు, రోష్ని, జగదీష్‌కుమార్, జోత్స్న తమపై దాడి చేశారని పేర్కొనగా.. పలగాని రోష్ని ఇచ్చిన ఫిర్యాదులో ఆరేపల్లి సాంబశివరావు, ఆరేపల్లి దేవేంద్ర, మరికొందరు తమపై దాడి చేశారని వివరించారు. ఇరువురి ఫిర్యాదులపై పోలీసులు కౌంటర్ కేసులు నమోదు చేశారు.

క్రిస్టియన్‌పేటలో..

కంకిపాడు: ఘర్షణపై ఇరువర్గాలపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని క్రిస్టియన్‌పేట గ్రామానికి చెందిన కె.దుర్గారావు, అతని భార్య తులసి మధ్య వాగ్వాదం జరుగుతుంది. వీరి ఇంటి వెనుక ప్రాంతంలో నివాసం ఉంటున్న పి.మరియమ్మ కుటుంబం దుర్గారావు కుటుంబం మధ్య ఘర్షణగా మారింది. రెండు కుటుంబాల మధ్య తీవ్ర వాగ్వాదం, ఘర్షణ చోటుచేసుకుని ఇరుపక్షాలకు చెందిన ఏడుగురు గాయపడ్డారు. ఇరుపక్షాలు పరస్పరం ఇచ్చిన ఫిర్యాదులపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు : విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు సోమవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం బీఎంపీఎస్ రోడ్డు, ఆంధ్రాబ్యాంక్ ఏరియా, పాల, కోళ్లఫారం బజార్ తదితర ప్రాంతాల్లో పైన తెలిపిన సమయాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వృత్తిదారులకు అండగా ప్రభుత్వం

కంకిపాడు: వృత్తిదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని సగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా టైలర్లు, రజకులు, నాయీబ్రాహ్మణులకు ఒక్కొక్కరికీ రూ. 10 వేలు సాయాన్ని ప్రభుత్వం విడుదల చేయటం హర్షణీయమన్నారు. వృత్తిదారులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభుత్వం పూనుకుందన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకుని కుటుంబాలు ఆర్థికంగా ఉన్నతి సాధించాలని ఆకాంక్షించారు.

ఘనంగా ముగిసిన బాలఏసు ఉత్సవాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక జ్యోతినగర్‌లోని ఆర్సీఎం చర్చిలో గత తొమ్మిదిరోజులుగా జరుగుతున్న దివ్య బాలఏసు మహోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల చివరి రోజు కావటంతో అధిక సంఖ్యలో క్రైస్తవులు దేవాలయానికి విచ్చేసి ప్రార్థనలు చేశారు. ఫాదర్‌లు కూర్చేళ్ల వినోద్, బి.వినయ్, ఏ.శ్రీకాంత్, ఎం.రమేష్ ఆధ్వర్యంలో బాలఏసుకు ఘనంగా దివ్య పూజ సమర్పించారు. జ్యోతినగర్ విచారణకర్త చేబ్రోలు జోసఫ్ తంబి, జేఎంజే సిస్టర్స్ పాల్గొనానరు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రత్యేక హోదా సమరయాత్ర



పెనమలూరు: పెనమలూరు మండలంలో సోమవారం ప్రత్యేక హోదా సమర యాత్ర నిర్వహించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో యాత్ర జరుగుతుంది. యాత్ర గంగూరుకు వచ్చిన సమయంలో సీపీఐ నేతలు జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి టి.తాతయ్య, నేతలు మేరుగు విజయ్‌కుమార్, మున్నంగి నరసింహారావు, మోతుకూరి అరుణ్‌కుమార్ స్వాగతం పలికారు.

మహాత్మునికి మహా నివాళి



పోరంకిలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

పెనమలూరు: జాతిపిత మహాత్మాగాంధీ 75వ వర్ధంతి సందర్భంగా పలువురు నివాళి అర్పించారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పోరంకిలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి పూజలు అనంతరం జాతిపిత మహాత్మాగాంధీ ఫొటోకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు పండ్లు పంపిణీ చేశారు. పోరంకి విజ్ఞాన్‌భారత్ పాఠశాలలో విద్యార్థులు మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. యనమలకుదురులో గాంధీ బొమ్మ సెంటర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి కోసూరి నరేష్‌కుమార్ మాట్లాడుతూ అహింసా సిద్ధాంతం, సహాయనిరాకరణ, సత్యాగ్రహం ఆయుధాలతో బ్రిటీష్ పాలకుల పై గాంధీజీ పోరాటం చేశారన్నారు.

జాతిపితకు ఘన నివాళి

ఉయ్యూరు: జాతిపిత బాపూజీ ఆశయ సాధన దిశగా యువత ముందుకు సాగాలని దళిత ఐక్య వేదిక వ్యవస్థాపకుడు పినమాల నాగకుమార్ కోరారు. స్థానిక దళిత ఐక్యవేదిక కార్యాలయంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఐక్యవేదిక వ్యవస్థాపకుడు నాగకుమార్ మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రతినిధులు అనిల్‌కుమార్, పవన్, ఫణికుమార్ పాల్గొన్నారు.

మహాత్ముని జీవితం ఆదర్శనీయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: జాతిపిత మహాత్మ గాంధీ జీవితం ఎంతో ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు అన్నారు. స్థానిక విజయవాడరోడ్డులోని సీతామహాలక్ష్మి నర్సింగ్ హోం ప్రాంగణంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. మహాత్మ



ఉయ్యూరులో మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత ఐక్యవేదిక ప్రతినిధులు



పెరికీడులో మహాత్ముని చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గాంధీ చిత్రపటానికి డాక్టర్ దుట్టాతో పాటుగా పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. యావత్ ప్రపంచానికి అహింసా మార్గం గొప్పతనాన్ని చాటిచెప్పినా మహనీయుడు మహాత్మగాంధీ అని కొనియాడారు. బాపులపాడు, పెరికీడు గ్రామాల్లోనూ మహాత్మగాంధీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి బాపులపాడు సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, పెరికీడు సర్పంచ్ పల్లపోతు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

గాంధీ మార్గం అనుసరణీయం

గన్నవరం రూరల్: జాతిపిత మహాత్మా గాంధీ బాటలో విద్యార్థులు నడవాలని ముస్తాబాద నవ భారత్ హైస్కూల్ కరస్పాండెంట్ షేక్ ఇమాం చెప్పారు. సోమవారం గాంధీజీ వర్ధంతి సందర్భంగా పాఠశాల ఆవరణలోని మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో సత్యం, అహింసలు ఆయుధాలుగా జాతికి స్వాతంత్ర్యాన్ని సాధించిన యోధుడు గాంధీజీ అని వక్తలు కొనియాడారు. ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే తెంపల్లి పంచాయితీ కార్యాలయం వద్ద సర్పంచ్ కొలుసు శిరీషా మహాత్ముని చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు.

కుష్ఠుని నివారించవచ్చు

నున్న(విజయవాడరూరల్): కుష్ఠువ్యాధిని చికిత్స ద్వారా పూర్తిగా నివారించవచ్చని వైద్య సిబ్బంది తెలిపారు.సోమవారం డాక్టర్ వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లో ప్రభుత్వ ఆదేశాల మేరకు కుష్ఠువ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. వ్యాధిని మల్టీడ్రగ్ ట్రీట్‌మెంట్ ద్వారా 6 నెలల్లో పూర్తిగా నివారించవచ్చని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుస్మితా తెలిపారు. స్పర్శలేని మచ్చలు, రాగిరంగు, తెలుపు రంగుల్లో వుండే మచ్చల ద్వారా ఈ వ్యాధినిగుర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు డీఎంఆర్ రత్నం, డీఎస్ఆర్ హన్న తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

హనుమాన్‌జంక్షన్ రూరల్: కుష్ఠు వ్యాధి రహిత సమాజాన్ని నిర్మించటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బాపులపాడు సర్పంచ్ సరిపల్లి కమలాభాయి అన్నారు. మండల కేంద్రమైన బాపులపాడుతో పాటుగా బొమ్ములూరు, పెరికీడు గ్రామాల్లో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ నారయ్య మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే కుష్ఠు వ్యాధిని నిర్ధారించటం ద్వారా సమూలంగా నిర్మూలించవచ్చని చెప్పారు. సర్పంచ్‌లు సరిపల్లి కమలాభాయి, కాటూరు విజయభాస్కర్, వల్లపోతు జాన్‌ప్రకాష్ పాల్గొన్నారు.

అందరి బాధ్యత..

గన్నవరం రూరల్: కుష్ఠు వ్యాధి నివారణ అందరి సామాజిక బాధ్యత అని మండల వైద్యాధికారి జె.సంధ్య అన్నారు. సోమవారం మండలంలో కుష్ఠు వ్యాధి నివారణపై 15రోజుల పాటు జరిగే ప్రచార కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మాదలవారిగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద ఏఎన్ఎం మేరీగ్రేస్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఆశా శివరాణి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది



ఉయ్యూరులో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది

కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వే

ఉయ్యూరు: కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వే సోమవారం నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉయ్యూరు పట్టణంలోని 20 వార్డులు, మండలంలోని 11 గ్రామాల్లో కుష్ఠు వ్యాధిపై సర్వే చేపట్టారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. కుష్ఠు వ్యాధి గ్రస్తుల నుంచి ప్రాథమిక సమాచారం సేకరించారు. ఉయ్యూరు పట్టణంలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేశారు. కుష్ఠు వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ తేజస్విని, మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, కౌన్సిలర్ గోన మదన్ పాల్గొన్నారు.

స్వచ్ఛ ఉయ్యూరులో భాగస్వాములు కావాలి

చైర్మన్ వల్లభనేని నాని

ఉయ్యూరు: స్వచ్ఛ ఉయ్యూరులో భాగస్వామ్యులై ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ వల్లభనేని నాని అధ్యక్షతన నిర్వహించారు. కమిషనర్ వెంకటేశ్వరరావు అజెండాలోని అంశాలను సభ్యుల ముందు ఉంచారు. అజెండాలోని పలు అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. చైర్మన్ వల్లభనేని నాని మాట్లాడుతూ వీరమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో అజెండాపై చర్చిస్తున్న చైర్మన్ వల్లభనేని నాని

గ్రామాల్లో సిటిజెన్ ఔట్‌రీచ్

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో సోమవారం సిటిజెన్ ఔట్‌రీచ్ కార్యక్రమం జరిగింది. వలంటీర్‌లు, సచివాలయం సిబ్బంది గ్రామంలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ కాపు నేస్తం, జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాలపై అవగాహన నిర్వహించారు. సచివాలయాల సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి

పెనమలూరు: విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించి విద్యలో రాణించాలని తహసీల్దార్ టీవీ సతీష్ అన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం కిలారు గంగాధర రావు, వసుమతి మెమోరియల్ ప్రతిభా అవార్డుల ప్రధాన మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కలిగి ఉండాలన్నారు. దాత కిలారు శివకుమార్ ఏటా విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ప్రతిభా పురస్కారాలు ఇవ్వటంపై అభినందించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎలమంచిలి దుర్గాభవాని, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎం.లక్ష్మి, ఎంఈవో ఎం.కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో నున్న విద్యార్థికి కాంస్యం



కాంస్య పతకం గెలుచుకున్న విద్యార్థి రామ్‌చంద్

నున్న(విజయవాడరూరల్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) అంతర్ జిల్లాల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ అండర్-17 కేటగిరిలో నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి దాసరి రామ్‌చంద్ శ్రీఈశ్వర్ కాంస్య పతకం సాధించినట్లు హైస్కూల్ హెచ్ఎం వి.భూపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి 29వరకు కర్నూల్‌లోని మాంటిస్సోరీ ఏ క్యాంప్‌లో ఈ పోటీలు జరిగాయి. కృష్ణాజిల్లా జట్టుకు రామ్‌చంద్ ప్రాతినిధ్యం వహించడం, కాంస్య పతకం సాధించడం పట్ల హైస్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. స్పోర్ట్స్ సర్టిఫికెట్ వల్ల భవిష్యత్ లో విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు ఉంటాయని హెచ్ఎం భూపాల్‌రెడ్డి తెలిపారు.

సింధూరం హీరో ధర్మ మహేష్‌కు ఘన స్వాగతం

హనుమాన్‌జంక్షన్ రూరల్: 'సింధూరం' చిత్ర హీరో, వర్ధమాన సినీనటుడు ధర్మ మహేష్‌కు హనుమాన్‌జంక్షన్‌లో ఆయన అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ నెల 26వ తేదీన విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించిన నేపథ్యంలో స్వగ్రామానికి విచ్చేసిన హీరో ధర్మ మహేష్‌కు సోమవారం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి భారీ ర్యాలీతో అపూర్వ స్వాగతం పలికారు. హనుమాన్‌జంక్షన్ కూడలి వద్ద భారీ పూల దండను క్రేన్ సాయంతో ధర్మ మహేష్‌కు అభిమానులు వేశారు. ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి చిత్రంతోనే వైవిధ్యమైన నటనను ప్రదర్శించి చిత్ర పరిశ్రమలో పలువురి మన్ననలు పొందిన హీరో ధర్మ మహేష్‌కు స్థానిక ప్రముఖులు అభినందనలు తెలిపారు. అనంతరం సింధూరం చిత్రాన్ని ప్రదర్శిస్తున్న కేఎస్ టాకీస్‌ను సందర్శించి ప్రేక్షకులకు అభివాదం చేశారు. తనపై ప్రేమాభిమానాలు చూపిన ప్రేక్షకుల రుణం తీర్చుకోలేనిదని, భవిష్యత్‌లోనూ అందరిని మెప్పించే మరిన్ని చిత్రాల్లో నటిస్తానని హీరో ధర్మ మహేష్ చెప్పారు.



జంక్షన్ సెంటర్‌లో హీరో ధర్మ మహేష్‌కు గజమాలను వేస్తున్న అభిమానులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఉంగుటూరు: అన్ని వర్గాల అభివృద్ధికి వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవలు చిరస్థాయిగా గుర్తుండిపోతాయని పలువురు చేదోడు లబ్ధిదారులు ప్రశంసించారు. ఆత్కూరు గ్రామ సచివాలయ ఆవరణలో చేదోడు లబ్ధిదారులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా అన్ని రంగాల్లో ఉన్న కుల వృత్తులు, చిరు వ్యాపారులకు జగనన్న చేదోడును అందజేసి ఆర్థిక తోడ్పాటును అందజేస్తున్నారని అన్నారు. ఏటా రూ.10వేలు చొప్పున ఒకొక్కరికీ రూ.30వేలు లబ్ధి చేకూరిందని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని, సోమవారం 147మంది ఖాతాల్లో రూ.10వేలు జమ చేసినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. సర్పంచ్ భూతపాటి ఎస్తేరమ్మ పాల్గొన్నారు.



ఆత్కూరులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చేదోడు లబ్ధిదారులు

మెరుగైన వైద్యసేవలే ప్రభుత్వ లక్ష్యం

కంకిపాడు: మెరుగైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యమని గొడవర్రు సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్-3 కార్యక్రమం సోమవారం నిర్వహించారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ విజయ చంద్రశేఖర్ ప్రారంభించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ 60 ఏళ్లు దాటిన 120 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ విజయచంద్రశేఖర్ మందులు అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలను చేరువ చేస్తూ ప్రజలందరి ఆరోగ్యం కోసం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మేరుగుమాల ఏసుమేరీ, కరుణ, శివకుమారి, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై ఆసక్తి పెంచుకోండి

నున్న(విజయవాడరూరల్): చిరుధాన్యాల పంటలను సాగుచేసేందుకు రైతులు ఆసక్తి చూపాలని వ్యవసాయశాఖ కమిషనరేట్ ఏడీఏ డి.చంద్రకళ సూచించారు. సోమవారం నున్న రైతుభరోసా కేంద్రంలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చంద్రకళ మాట్లాడుతూ చిరుధాన్యాల సాగులో తక్కువఖర్చుతో అధిక లాభాలను పొందవచ్చని చెప్పారు. చిరుధాన్యాలను తీసుకోవడం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలను అధిగమించవచ్చన్నారు. విజయవాడ ఏడీఏ బి.వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఒక ఎకరం వరిపంటకు అవసరమైన నీటితో 6 ఎకరాల చిరుధాన్యాలను సాగు చేసుకోవచ్చన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, టెక్నికల్ అధికారి శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి బి.రంగనాధ్ బాబు, నున్న సొసైటీ చైర్మన్ పోలారెడ్డి చంద్రారెడ్డి పాల్గొన్నారు. అనంతరం చాగంటి వెంకటరెడ్డి అనే రైతు సాగు చేస్తున్న జొన్న పంటను సందర్శించారు.



మాట్లాడుతున్న ఏడీఏ చంద్రకళ, వేదికపై ఏడీఏ వెంకటేశ్వరావు, చైర్మన్ నాగిరెడ్డి

హైవేకు సర్వీస్ రోడ్డు నిర్మించాలి

కొండపావులూరు వద్ద ఆర్డీవో పద్మావతికి రైతుల వినతి

గన్నవరం రూరల్: మండలంలో నిర్మితమవుతున్న నేషనల్ హైవేకు సర్వీస్ రోడ్డు నిర్మించాలని రైతాంగం గుడివాడ ఆర్డీవో పద్మావతికి విజ్ఞప్తి చేశారు. చిన అవుటపల్లి, మర్లపాలెం, బీబీగూడెం, కొండపావులూరు, సూరంపల్లి, రామచంద్రాపురం, నున్న గ్రామాల్లో నేషనల్ హైవే నిర్మాణం కొనసాగుతోంది. కొండపావులూరు గ్రామం వద్ద హైవే పైకి వాహనాలు వెళ్లకుండా అధికారులు గోడ నిర్మించేందుకు ప్రయత్నాలు చేయటంతో స్థానిక రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతుల వినతి మేరకు కొండపావులూరు వద్ద ఆర్డీవో సోమవారం పరిశీలన చేసి రైతులతో మాట్లాడారు. సర్వీస్ రోడ్డు కోరుతూ ఆయా గ్రామాల్లో రైతుల వినతులను గ్రామ సభల ద్వారా తీర్మానాలు చేసి అందజేస్తే ఉన్నతాధికారులకు పంపుతామని ఆర్డీవో రైతాంగానికి హామీ ఇచ్చారు. తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు, ఆర్ఐ ఉదయ్, మండల సర్వేయర్ మాధవరావు, వీఆర్వో చందన శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఎస్ఐ జి.రమేష్‌బాబు శాంతి భద్రతలు పర్యవేక్షించారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో పద్మావతి

ఇళ్ల ప్లాట్లకు కొలతలు తీయండి

విజయవాడరూరల్: గొల్లపూడి ఎట్కిన్సన్ స్కూల్ రోడ్డులో ఉన్న రెండు ఇళ్ల ప్లాట్లకు కొలతలు కొలిచి చూపించాలని నూతక్కి నిరంజన్ అనే వ్యక్తి అధికారులకు దరఖాస్తు చేశారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆర్ఎస్ నంబర్లు 466/4,472/2ల్లో ఉండాల్సిన ఇళ్ల స్థలాలు రోడ్డు నిర్మించినందును తన స్థలాల హద్దులను గుర్తించలేదన్నారు. అలాగే రామవరప్పాడు గ్రామానికి చెందిన చాగంటిపాటి శ్రీనివాసరావు సర్వే నంబర్లు30/1,31లలో ఉండాల్సిన బోదికాల్వ ఆక్రమణలకు గురైందని, దాన్ని కొలిచి అప్పగించాలని అర్జీ ఇచ్చారు. స్పందనలో మండల ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ భార్గవి, వ్యవసాయాధికారి రంగనాథ్, మండల సర్వేయర్ రమేష్ పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన


పెనమలూరు: గంగూరు గ్రామంలో ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధికి సోమవారం శంకుస్థాపన చేశారు. మసీదు కమిటీ సభ్యుడు అక్బర్‌బాషా తెలిపిన వివరాల ప్రకారం స్మశానవాటిక ప్రహరీ శిథిలావస్థకు చేరటంతో గోడ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. మండల పరిషత్ నిధులు రూ. 6 లక్షలు, గ్రామపంచాయతీ నిధులు రూ. 4 లక్షలు కలిపి మొత్తం రూ. 10 లక్షలతో ప్రహరీ నిర్మాణం చేస్తామన్నారు. చాలా కాలంగా ఉన్న ఈ సమస్యకు ఎట్టకేలకు పనులు చేపట్టామన్నారు. త్వరలో ఎస్సీ శ్మశానవాటిక గోడ కూడా నిర్మాణం చేపడతామన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు గని, ముజీబ్, అజీజుల్లాఖాన్, నందేటి రవి, యాహియాబాషా పాల్గొన్నారు.



శంకుస్థాపన సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న గ్రామపెద్దలు

వక్ఫ్ బోర్డులో అక్రమాలపై విచారణ జరిపించాలి

రామవరప్పాడు : ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డులో టీడీపీ హయాంలో జరిగినటువంటి అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని ముస్లిం రైట్స్ అండ్ వెల్ఫేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ నూరుద్దీన్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో సోమవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూరుద్దీన్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో వక్ఫ్ బోర్డులో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఈ విషయంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని విచారణ జరిపించాలని కోరారు. నగరంలోని భవానీపురానికి చెందిన తెలుగు తమ్ముడు మాజీ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఖాజాకు గులాం గిరి చేస్తున్న వక్ఫ్ బోర్డులో కొంత మంది అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.



సయ్యద్ నూరుద్దీన్

నేడు గన్నవరంలో బాలోత్సవం

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జరగనున్న పిల్లల పండుగ బాలోత్సవానికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వాహణ కమిటీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు గన్నె వెంకట్రావు మాట్లాడుతూ గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల స్థాయిలో ఈ బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూడు మండలాల నుంచి సుమారు 42 ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు చెందిన సుమారు 1,500 మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 3.30 వరకు అకడమిక్, కల్చరల్ ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.



కార్యక్రమాల వివరాలను వెల్లడిస్తున్న బొడ్డు, గన్నె